

## విస్తృతంగా 'ఆరోగ్య మహిళ'

'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని విస్తృతంగా చేసే దిశగా ప్రభుత్వం మరికొన్ని పీహెచ్‌సీలకు అనుమతి జారీ చేసింది. 12లో



## విద్యార్థులకు నాణ్యమైన విద్య

గురుకులాల్లో విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యనందించాలని ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్ సూచించారు. 10లో




## వాతావరణం

జిల్లాలో ఆదివారం అక్కడక్కడా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మిగతా ప్రాంతాల్లో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

## న్యూస్‌రీల్

### విధుల్లో చేరిన అదనపు కలెక్టర్ సత్యప్రసాద్



కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

**ఖమ్మంసహకారనగర్:** జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా బి.సత్యప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న అభిలాష అభినవ్‌కు బదిలీ కాగా, రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్‌గా ఉన్న సత్యప్రసాద్‌ను ఖమ్మంకు కేటాయించారు. ఈసందర్భంగా ఆయన కలెక్టరేట్‌లో శనివారం బాధ్యతలు స్వీకరించగా, తొలుత క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్‌కు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

### శ్రీవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

**ఎర్రుపాలెం:** మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు శ్రీవారి పాదంతో పాటు మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అలాగే, స్వామి, అమ్మ వార్లను పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి నిత్య కల్యాణం జరిపించారు. తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల భక్తులు వేలాదిగా నిత్యకల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం స్వామి, వార్లకు పల్లకీ సేవ జరిపించాక, భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.

### దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు



ఉద్యోగులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

**తల్లాడ:** ఓటరు నమోదు దరఖాస్తులతో పాటు ఇతరత్రా ఏవీ కూడా పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. తల్లాడ తహసీల్‌ను శనివారం తనిఖీ చేసిన ఆయన తహసీల్దార్ రవికుమార్, ఉద్యోగులతో సమావేశమయ్యారు. సంపూర్ణమైన ఓటరు జాబితాను సిద్ధం చేసేలా కొత్త వారికి అవకాశం కల్పించడమే కాక చనిపోయిన, రెండేసి చోట్ల ఓట్లు ఉన్న వారి పేర్లు తొలగించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదుకు ఈనెల 19వరకు అవకాశం ఉన్నందున యువతకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీటీ వనజ, ఆర్‌ఐలు రాధిక, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ పదోన్నతులపై అప్పీళ్లు స్వీకరణ



అప్పీళ్లను పరిశీలిస్తున్న ఉద్యోగులు

**ఖమ్మంసహకారనగర్:** ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి దరఖాస్తులపై అప్పీళ్ల స్వీకరణ కొనసాగుతోంది. ఈమేరకు డీఈఓ కార్యాలయంలో పది కౌంటర్ల ద్వారా శనివారం అప్పీళ్లు స్వీకరించి పరిశీలన ప్రారంభించినట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. పదోన్నతులపై 126, బదిలీలపై 32 దరఖాస్తులు అందాయని, ప్రిపరేషన్ కేటగిరీలో వితంతువులు, దివ్యాంగులు, స్పౌస్ కేటగిరీల దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పరిశీలనలో ఉద్యోగులు దేవేందర్, నందకిషోర్, వై శ్రీనివాసరావు, షకీల్, అహ్మద్, యూసఫ్, హైమద్, స్వర్ణలత, కే.వీ.రామారావు, శేషుకుమారి, బి.నగేష్, పూర్ణ, ప్రసాద్, సయ్యద్ జిలానీ, రెహమాన్, శ్రీదేవి, కే.వీ.మాధవరావు, రాంబాబు, నరేందర్, కిరణ్‌కుమార్, యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.




# మాటలు.. మంటలు..

### వైరా బీఆర్‌ఎస్‌లో అసమ్మతి సెగలు

- కలిసి ఉంటామంటూనే ఘాటు విమర్శలు
- మదన్‌లాల్‌పై ఎమ్మెల్యే రాములునాయక్ గుస్సా
- ఇరువురి నడుమ చిచ్చురేపిన 'దళితబంధు' జాబితా

**సాక్షిప్రతినిధి, ఖమ్మం:** వైరా నియోజకవర్గ బీఆర్‌ఎస్‌లో వైరం ఆరని మంటలా సాగుతోంది. వచ్చే ఎన్నికల్లో టికెట్ కోసం సిట్టింగ్ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ చేసిన ప్రయత్నాలు ఫలించక.. మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్‌కు అధిష్టానం అవకాశం ఇవ్వడంతో ఎమ్మెల్యేతో పాటు ఆయన వర్గం మండిపడింది. తమ సత్తా చూపిస్తామని శపథం చేసింది. ఆ తర్వాత అధిష్టానం బుజ్జగింపులతో శాంతించి.. కలిసి పనిచేస్తామని వెల్లడించింది. ఇంతలోనే శుక్రవారం ఎమ్మెల్యే చేసిన ఘాటు వ్యాఖ్యలు ఆ పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపాయి. ప్రధానంగా దళితబంధు లబ్ధిదారుల ఎంపిక వ్యవహారం రెండు వర్గాల మధ్య వైరాన్ని పెంచింది.

**టికెట్ ఆశించి భంగపడి..**

బీఆర్‌ఎస్ అధిష్టానం టికెట్లు ప్రకటించకముందే వైరా ఎమ్మెల్యే రాములునాయక్‌కు టికెట్ రాదనే ప్రచారం మొదలైంది. ఈక్రమంలో ఎమ్మెల్యే తనకే టికెట్ ఇవ్వాలంటూ ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల ద్వారా రాయబారాలు నడపడంతో పాటు తన తనయుడితో పాటు ప్రగతిభవన్‌కు వెళ్లి చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదు. ఆ తర్వాత పార్టీ మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్‌కు టికెట్ కేటాయించింది. దీంతో తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే... రానున్న ఎన్నికల్లో తానేంటో చూపిస్తానంటూ హెచ్చరికలు కూడా జారీ చేశారు. దీనిపై అధిష్టానం బుజ్జగించడంతో కొంత మెత్తపడిన ఆయన, పార్టీ ప్రకటించిన అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. దీంతో అంతా సర్దుకున్నట్లేనని అధిష్టానం సహా అందరూ భావించారు.

**దళితబంధు రగడ**

నియోజకవర్గాల్లో దళితబంధు లబ్ధిదారుల ఎంపిక ఎమ్మెల్యే ఆధ్వర్యాన జరుగుతోంది. వైరా నియోజకవర్గంలోని అన్ని మండలాలకు కలిపి 1,120 మందితో పేర్లతో ఎమ్మెల్యే రాములునాయక్‌ను జాబితాను అధికారులకు పంపినట్లు తెలిసింది. ఈ జాబితా ప్రకారమే యూనిట్లు మంజూరవుతాయని ఎమ్మెల్యే భావిస్తుండగా, కొందరిని ఎంపిక చేసే అవకాశం పార్టీ అభ్యర్థి మదన్‌లాల్‌కు అధిష్టానం ఇచ్చిందన్న సమాచారంతో ఎమ్మెల్యే భగ్గుమన్నారు. గతంలో ఇక్కడ దళితబంధు అర్హుల ఎంపికలో చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలతో మదన్‌లాల్‌కు అవకాశం ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఎమ్మెల్యే తన ప్రతిపాదనలను పక్కన పెడుతున్నారంటూ మదన్‌లాల్‌తో పాటు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌పై శుక్రవారం నాటి సమావేశంలో తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

**చెడిన సయోధ్య**

ఎమ్మెల్యే రాములునాయక్ వ్యాఖ్యలతో రెండు వర్గాల మధ్య ఉన్న సయోధ్య చెడినట్లయింది. ఈ పరిస్థితితో ఎమ్మెల్యే వెంట ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధుల్లో ఒక్కరొక్కరుగా మదన్‌లాల్ వైపు వెళ్తున్నట్లు సమాచారం. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్షాలను దీటుగా ఎదుర్కోవాల్సి ఉండగా.. రెండు వర్గాల పోరు మొదలవడం అధిష్టానం దృష్టికి కూడా వెళ్లినట్లు తెలిసింది. ఎమ్మెల్యే, అభ్యర్థి నడుమ మధ్య పంచాయితీకి దారితీసిన పరిస్థితులపై ఆరా తీయడమే కాక... ఆచితూచి వ్యవహరించాలని మదన్‌లాల్‌కు పార్టీ పెద్దలు సూచించినట్లు సమాచారం. ఇక సిట్టింగ్ ఎమ్మెల్యే, పార్టీ ప్రకటించిన అభ్యర్థి మదన్‌లాల్ వ్యవహార శైలి ప్రతిపక్షాలకు అస్త్రంగా మారే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. దళితబంధు లబ్ధిదారుల జాబితా విషయాన్ని ఎమ్మెల్యే బహిరంగంగా ప్రస్తావించడంతో ఎమ్మెల్యేలు చెప్పిన అధికార పార్టీ నేతలకే లబ్ధి చేకూరుతోందనే విమర్శలు వస్తున్నాయి. అయితే, అభ్యర్థిని ప్రకటించిన కొన్నాళ్లకే వైరా నియోజకవర్గంలో మొదలైన ఈ విభేదాలను బీఆర్‌ఎస్ అధిష్టానం ఎలా పరిష్కరిస్తుందో వేచి చూడాల్సిందే.

# దండాలతో అభివృద్ధి జరగదు..

- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి అజయ్‌కుమార్
- రూ.7.40కోట్ల నిధులతో రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన



రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పువ్వాడ, పక్కన నాయకులు

**ఖమ్మంఅర్బన్:** దండాలు, దస్కాలతో నిధులు రావు, అభివృద్ధి జరగదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. చిత్తశుద్ధి, అంకితభావంతో పాటు ప్రజల సమస్యలు పరిష్కరించాలి, సౌకర్యాలు కల్పించాలనే తపన ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఖమ్మం 15వ డివిజన్ పరిధి ఎస్‌ఆర్ గార్డెన్ నుంచి పుట్టకోట వరకు 'సుడా' నిధులు రూ.7.40 కోట్లతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డివైడర్ల నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి పువ్వాడ మాట్లాడుతూ కల్లబొల్లి మాటలు చెప్పేటోళ్లను నమ్మి మోసపోవద్దని సూచించారు. మరోమారు అవకాశమిస్తే ఇప్పటికే అభివృద్ధిలో పరుగులు పెడుతున్న ఖమ్మంను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపుతానని తెలిపారు. గడిచిన నాలుగున్నరేళ్లలో రూ.2వేల కోట్ల పైచిలుకు నిధులు తీసుకొచ్చి హైదరాబాద్‌కు దీటుగా ఖమ్మంను తయారు చేశానని వెల్లడించారు. పుట్టకోట రోడ్డు విస్తరణ కోసం ఇప్పటికే కేటాయించిన నిధులకు తోడు ఇరువైపులా డ్రెయినేజీల నిర్మాణానికి మరో రూ.2.50 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ముందుగా ఎస్‌ఆర్ గార్డెన్ నుంచి పుట్టకోట వరకు ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకుడు బీరెడ్డి నాగచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి, కార్పొరేటర్లు రావూరి కరుణసైదబాబు, కూరాకుల వలరాజు, బీఆర్‌ఎస్ నాయకులు సంక్రాంతి నాగేశ్వరరావు, మొర్రిమేకల కోటయ్య, పెంటయ్య, గొడుగు వెంకటేశ్వర్లు, కాంపాటి రమేశ్, పత్తిపాటి వెంకటేశ్వర్లు, గోపాలరావు, ముప్పారపు ఉపేందర్రావు, అనుబోతు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీకి వెళ్లే బస్సులు కుదింపు



సత్తుపల్లి నుంచి మధ్యాహ్నం నుంచి ఏపీకి వెళ్తున్న బస్సు

**ఖమ్మంమామిళ్లగూడెం/సత్తుపల్లి టౌన్:** మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు అరెస్టుతో ఏపీలో టీడీపీ నాయకులు గొడవకు దిగే అవకాశం ఉందన్న సమాచారంతో ఆర్టీసీ అధికారులు ముందస్తుగా సర్వీసులు నిలిపేశారు. ఖమ్మం రీజియన్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని పలు పట్టణాలకు వెళ్లే కొన్ని బస్సులను పూర్తిగా, మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేశారు. రీజియన్‌లోని ఆరు డిపోల పరిధిలో 54 బస్సులను పూర్తిగా రద్దు చేసిన అధికారులు, 17 బస్సులను మధ్యాహ్నం తర్వాత నడిపించారు. మొత్తంగా రీజియన్ పరిధిలో 27,633 కి.మీ. మేర తిరగాల్సిన బస్సులు రద్దయినట్లు అధికారులు వెల్లడించారు. కాగా, సత్తుపల్లి ఆర్టీసీ డిపో నుంచి విజయవాడ, ఏలూరు, తిరువూరు రూట్లలో 14 సర్వీసులను ఉదయం రద్దుచేసి, మధ్యాహ్నం తర్వాత యథాతథంగా నడిపించినట్లు డీఎం యు.రాజ్యలక్ష్మి తెలిపారు.



ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ వద్ద బారులు దీరిన జ్వరపీడితులు

# డెంగీ.. డేంజర్

### జిల్లాలో నానాటికీ పెరుగుతున్న కేసులు

- ఈనెల 9రోజుల్లోనే 64 మందికి వైరస్
- ఆస్పత్రుల బాట పడుతున్న జనం
- పరిసరాల పరిశుభ్రతోనే కట్టడి చేయొచ్చంటున్న వైద్య, ఆరోగ్య శాఖ

**ఖమ్మం వైద్యవిభాగం:** జిల్లాలో డెంగీ కేసులు పెరుగుతుండడంతో ప్రమాదఘంటికలు మోగుతున్నాయి. ఈ సీజన్‌లో డెంగీతో పాటు మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా వ్యాధులు ప్రబలడం సహజంగా భావిస్తారు. కానీ కొద్దిరోజులుగా అసాధారణ స్థాయిలో డెంగీ కేసులు పెరుగుతుండడం, అక్కడక్కడా మరణాలు చోటు చేసుకుంటుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టినా కేసులు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పారిశుద్ధ్య సమస్య ఏర్పడి డెంగీ దోమలు వృద్ధి చెందుతుండడంతో ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఈనెలలో తొమ్మిది రోజుల్లోనే 64 మంది డెంగీ బారిన పడడం పరిస్థితి తీవ్రతను తెలియచేస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు కిక్కిరిసి కనిపిస్తున్నాయి.

**ఉధృతంగా కేసులు**

డెంగీ జ్వరం దోమల వల్ల సోకుతుంది. వ్యాధి బారిన పడిన వారి పరిస్థితి ఒక్కోసారి విషమించి మృతి చెందే ప్రమాదముంది. జ్వరం వచ్చాక బాధితులు పూర్తిగా నీరసించి పోవడం, ప్లేట్‌లెట్లు పడిపోతుంటాయి. ఈనెలలో 64 కేసులు నమోదైనట్లు ప్రభుత్వ గణాంకాల ద్వారా తెలుస్తున్నా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరే వారి సంఖ్య కలిపితే మరింత ఎక్కువగా ఉంటుందని సమాచారం.

**వేంసూరు పీహెచ్‌సీ పరిధిలో ఎక్కువ**

వేంసూరు పీహెచ్‌సీ పరిధిలో డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ మండలంలోని కందుకూరులో బాధితులు ఎక్కువగా ఉండడం, గత వారంలోనే 20 కేసులు నమోదు కావడం గమనార్హం. తాజాగా డీఎంహెచ్‌ఓ మాలతి ఆ గ్రామానికి వెళ్లి పరిశీలించగా, అపరిశుభ్ర వాతావరణం మూలంగానే దోమలు వృద్ధి చెంది డెంగీ వ్యాప్తికి కారణమైనట్లు గుర్తించారు. అలాగే, ఖమ్మం, మంచుకొండ, వల్లబి, ఎం.వీ.పాలెంల్లోనూ ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయి.

**పరిసరాల పరిశుభ్రతే మార్గం**

ప్రజల సహకారం తోడైతేనే వ్యాధులను అరికట్టొచ్చని అధికారులు చెబుతున్నారు. తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలను అరికట్టడం, తద్వారా వ్యాధుల వ్యాప్తికి చెక్ పెట్టొచ్చని వెల్లడిస్తున్నారు.

**గత నాలుగు నెలల్లో నమోదైన కేసులు**

| నెల | కేసులు | నెల | కేసులు |
|---|---|---|---|
| జూన్ | 5 | ఆగస్టు | 61 |
| జూలై | 14 | సెప్టెంబర్ | 64 |



ఇన్‌పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న బాధితులు

### ప్రత్యేక బృందాలతో వైద్యశిబిరాలు



వైద్య, ఆరోగ్య శాఖ తీసుకున్న ముందస్తు చర్యలతో వ్యాధుల వ్యాప్తిని అరికట్టగలిగాం. డెంగీ కేసులు అక్కడక్కడా వెలుగు చూస్తున్న మాట వాస్తవమే. అయితే, పరిసరాల పరిశుభ్రత పాటించకపోవడమే ఇందుకు కారణం. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక బృందాల ద్వారా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేకున్నా... పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ తగిన జాగ్రత్తలు వహించాలి.

– డాక్టర్ బి.మాలతి, డీఎంహెచ్‌ఓ

# లోక్ అదాలత్‌లో రికార్డ్..

- 17,718 కేసుల పరిష్కారం
- మోటారు ప్రమాద కేసుల్లో రూ.2కోట్లకు పైగా పరిహారం



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జగ్జీవన్‌కుమార్



రోడ్డు ప్రమాద కేసులో అవార్డు జారీ చేస్తున్న న్యాయమూర్తి రాంప్రసాదరావు

**ఖమ్మంలీగల్:** జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైంది. ఖమ్మం జిల్లా కోర్టుతో పాటు సత్తుపల్లి, మధిర కోర్టుల్లో బెంచ్‌లు ఏర్పాటుచేయగా, రికార్డు స్థాయిలో 17,718 కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లా జడ్జి బీ.ఎస్.జగ్జీవన్ కుమార్ లోక్ అదాలత్‌ను ప్రారంభించగా.. న్యాయమూర్తులు డి.రాంప్రసాదరావు, ఎన్.అమరావతి, పి.నాగశ్రావ్య, వి.మాధవి, ఆర్.శాంతిలత, కె.దీపలోక్ వివిధ బెంచ్‌లకు అధ్యక్షత వహించారు. న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా పర్యవేక్షించారు. కాగా, 66 మోటారు ప్రమాద కేసులను పరిష్కరించగా, బాధితులకు రూ.2 కోట్లకు పైగా పరిహారం చెల్లించేందుకు బీమా కంపెనీల అధికారులు అంగీకరించారు. ఇవికాక 969 క్రిమినల్ కేసులు, 28 చెక్కు కేసులు, 133 సివిల్ కేసులతో పాటు ఇతర కేసులు 16,522 పరిష్కారమయ్యాయి. అలాగే, బీఎస్ఎన్ఎల్ దాఖలు చేసిన వాటిలో 88 కేసులను పరిష్కరించారు. న్యాయవాదులు ఎం.లక్ష్మీనారాయణ, జి.అమర్‌నాథ్, అరుణ, ఆర్.వెంకట్, కే.వీ.వీ.లక్ష్మి, ప్రవీణ్‌కుమార్ లోక్ అదాలత్ సభ్యులుగా వ్యవహరించారు.

**రోడ్డు ప్రమాదం కేసులో రూ.1.50లక్షల పరిహారం**

జాతీయ లోక్ అదాలత్ ద్వారా రోడ్డు ప్రమాద కేసును అతి తక్కువ సమయంలో పరిష్కరించారు. కొత్తగూడెంకు చెందిన కొండపల్లి సింహాచలరావు విధులు ముగించుకుని గత ఏడాది ఆగస్టు 1న ఖమ్మం నుంచి వెళ్తూ మణుగూరు డిపో బస్సు ఎక్కాడు. ఏన్కూరు సమీపాన జరిగిన ప్రమాదంలో ఆయనతో పాటు పలువురు గాయపడగా సింహాచలరావు పరిహారం కోరుతూ ఖమ్మం జిల్లా కోర్టులో ఈ ఏడాది కేసు దాఖలు చేశాడు. న్యాయసేవా సంస్థ న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ జావీద్ పాషా ప్రత్యేక చొరవతో న్యూఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ఖమ్మం బ్రాంచ్ మేనేజర్ రేణుక తమ న్యాయవాదులతో చర్చించి నష్టపరిహారంగా రూ.1.60 లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించడంతో పిటీషనర్ అంగీకరించాడు. దీంతో న్యాయమూర్తి డి.రాంప్రసాదరావు అవార్డు జారీ చేశారు. పిటిషనర్ తరఫున ఇమ్మడి లక్ష్మీనారాయణ న్యాయవాదిగా వ్యవహరించగా, కంపెనీ న్యాయవాదులు సీతారామారావు, కొత్తపల్లి రామారావు, స్వర్ణ రాంబాబు, పద్మావతి, లోక్ అదాలత్ మెంబర్ మాదిరాజు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

**సులభ వాయిదాలతో రుణాలు వసూలు చేసుకోండి**

రుణగ్రహీతల నుంచి బకాయిలు వసూలు చేసుకునేందుకు సులభ వాయిదాలు ఇవ్వాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీ.ఎస్.జగ్జీవన్ కుమార్ బ్యాంకర్లకు సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా బ్యాంక్ అధికారులు, కక్షిదారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ సులభ వాయిదాలు, వడ్డీ తగ్గింపుతో కేసులు సత్వరమే పరిష్కారమవుతాయని తెలిపారు. అనంతరం జిల్లా జడ్జి మూడో అదనపు జిల్లా కోర్టులో నిర్వహిస్తున్న బీమా కంపెనీల లోక్ అదాలత్‌ను పరిశీలించారు.

# 'మువ్వా'కు కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీలో చోటు

**వైస్ చైర్మన్‌గా నియమిస్తూ ఏఐసీసీ ప్రకటన**



మువ్వా విజయ్‌బాబు

**ఖమ్మంమయూరిసెంటర్:** డీసీసీబీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు మువ్వా విజయ్‌బాబుకు కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీలో స్థానం దక్కింది. మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చైర్మన్‌గా, 23 మంది వైస్ చైర్మన్లుగా మేనిఫెస్టో కమిటీని శనివారం ఏఐసీసీ ప్రకటించింది. ఇందులో మువ్వాకు అవకాశం లభించింది. ఆయనకు పదవి రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయ్‌బాబు మాట్లాడుతూ ఏఐసీసీ తనపై నమ్మకంతో కీలక బాధ్యత అప్పగించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. పదవి రావడానికి సహకరించిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

### రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన

**భద్రాచలం:** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశాక, స్వామివారి ఉత్సవమూర్తులను బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## క్లుప్తంగా

### నేడు మంత్రి పువ్వాడ పర్యటన

**ఖమ్మంమయూరిసెంటర్:** రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8.30 గంటలకు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి సమీపాన జరిగే చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఆతర్వాత సర్దార్ పటేల్ స్టేడియంలో మహిళల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌ను, అనంతరం ఎన్నెస్పీ క్యాంపులో పీఆర్టీయూ కార్యాలయ భవనం, జూబ్లీ క్లబ్‌లో షటిల్ కోర్ట్‌ను ప్రారంభిస్తారు. అలాగే, సాయంత్రం 4గంటలకు 47వ డివిజన్ బొక్కలగడ్డ ప్రాంతంలో మున్నేరు వరద బాధితులకు ఆర్థిక సాయం పంపిణీ చేయనున్నారు.

### ఏఐసీసీ కార్యక్రమ నిర్వహణ కమిటీ సభ్యుడిగా వేమిరెడ్డి



వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

**మధిర:** ఏఐసీసీ శనివారం పలు కమిటీలను ప్రకటించగా, కార్యక్రమ నిర్వహణ కమిటీ సభ్యుడిగా వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డికి స్థానం దక్కింది. మాజీ ఎంపీ బలరాంనాయక్ చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో శ్రీనివాసరెడ్డికి చోటు కల్పించారు. మధిర మున్సిపాలిటీ పరిధిలని మడుపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కకు ముఖ్య అనుచరుడిగా కొనసాగుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మధిర మార్కెట్ చైర్మన్‌గా పనిచేసిన ఆయన జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా, ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో కార్యక్రమ నిర్వహణ కమిటీ సభ్యుడిగా నియామకానికి కృషి చేసిన సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

### నేడు జిల్లాలో పొంగులేటి పర్యటన

**ఖమ్మంమయూరిసెంటర్:** కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కోచైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం ఈశ్వరమాదారం, రాజుపేట, నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం, తిరుమలాపురం, నేలకొండపల్లి, ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురం, ఖమ్మంరూరల్ మండలం రెడ్డిపల్లి, ఖమ్మంలోని గాంధీచౌక్, బోసుబొమ్మసెంటర్, కొణిజర్ల మండలం తనికెళ్ల, వైరాలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆతర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో కూడా పర్యటిస్తారని పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

### డీసీసీ అధ్యక్షుడిని అభినందించిన ఠాక్రే



సమావేశంలో పాల్గొన్న దుర్గాప్రసాద్, నాయకులు

**ఖమ్మంసహకారనగర్:** ఏఐసీసీ, టీపీసీసీ పిలుపునిచ్చిన అన్ని కార్యక్రమాలను ఖమ్మం జిల్లాలో విజయవంతంగా నిర్వహిస్తుండడంపై కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌ను పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే అభినందించారు. హైదరాబాద్‌లో శనివారం జిల్లా, సిటీ, బ్లాక్, మండల అధ్యక్షులకు శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి జిల్లా నుంచి పువ్వాళ్లతోపాటు కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావేద్, మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వడ్డె నారాయణరావు, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, శీలం వెంకటనర్సిరెడ్డి, గాలి దుర్గారావు, కొమ్మినేని రమేష్‌బాబు, కాసర చంద్రశేఖర్‌రెడ్డి, వేణు, పెద్దబోయిన దుర్గాప్రసాద్, కాపా సుధాకర్, దగ్గుల రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లాలో కార్యక్రమాల నిర్వహణపై పువ్వాళ బృందాన్ని ఠాక్రే అభినందించారు.

### సంస్థ మీటర్‌కు బదులు మరొకటి...

**విద్యుత్ చౌర్యం కేసులో రూ.8.70 లక్షల జరిమానా**

**నేలకొండపల్లి:** ఎన్పీడీసీఎల్ అమర్చిన మీటర్‌ను తొలగించి ఇంకొకటి అమర్చుకున్న వ్యక్తి యథేచ్ఛగా విద్యుత్ చౌర్యానికి పాల్పడున్నాడు. విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో ఈ విషయం బయటపడగా, రూ.8.70లక్షల జరిమానా విధించడంతో పాటు యజమానిపై కేసు నమోదు చేశారు. వివరాలు... మండలంలోని మోటాపురంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో ఓ వ్యక్తి ఇంట్లో తనిఖీ చేయగా, మీటర్ మార్చి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు తేలింది. దీంతో ఆయనకు భారీగా జరిమానా విధించడమే కాక కేసు నమోదు చేశారు. ఆతర్వాత అదనంగా 54 మంది సిబ్బంది పిలిపించి బృందాలుగా విడదీసి గ్రామంలోని ప్రతీ ఇంటిని తనిఖీ చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏడీ సత్యనారాయణ, అధికారులు షేక్ మీరా, కోక్యానాయక్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



| పామాయిల్ గెలలు | |
|---|---|
| టన్ను ధర | రూ.13,026 |

# ప్రజారోగ్యంపై పట్టింపేదీ?

- వేంసూరు మండలంలో భారీగా జ్వరబాధితులు
- ప్రతీ ఇంట్లో ఒకరిద్దరికి జ్వరం
- పారిశుద్ధ్య చర్యల్లో నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి
- మొక్కుబడిగా డ్రై డే కార్యక్రమం



వేంసూరులో నిండిన చెత్తకుండీ

**వేంసూరు:** వేంసూరు మండలంలో పలు గ్రామాల ప్రజలు జ్వరంలో అల్లాడిపోతున్నారు. డెంగీ కేసులు రోజురోజుకు పెరుగుతుండడంతో ఆందోళన నెలకొంది. అయితే, నమోదవుతున్న కేసులను కూడా వైద్యాధికారులు తక్కువగా చూపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే, పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించకపోవడం, డ్రై డే కార్యక్రమాలు నామమాత్రంగా నిర్వహిస్తుండడం, డెంగీ కేసులు ఒకటి, రెండు నమోదు కాగానే నియంత్రణను పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని విమర్శిస్తున్నారు.

**పారిశుద్ధ్య చర్యలు శూన్యం:**

మండలంలోని 26 గ్రామపంచాయిల్లో పారిశుద్ధ్య నిర్వహణపై పాలకవర్గాలు, కార్యదర్శులు దృష్టి సారించకపోవడంతో దోమల బెడద ఎక్కువైంది. డ్రెయినేజీలు, ఖాళీ స్థలాల్లో నిల్వ నీటితో తొలగించకపోవడం, చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. మురుగు ఉన్న ప్రదేశాల్లో కాకుండా రహదారుల వెంట బ్లీచింగ్ చల్లుతూ తమ పని అయిపోయినట్లుగా అధికారుల ముందు చెప్పుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

**అనారోగ్యం వస్తే ఆర్‌ఎంపీలే దిక్కు**

ప్రతీ గ్రామంలో ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఆరోగ్య ఉప కేంద్రాలను నిర్మించింది. పల్లె దవాఖానాల్లో ఎంబీబీఎస్ వైద్యుడితో పాటు సిబ్బందిని నియమించినా పెద్దగా వైద్యం అందడం లేదనే చెప్పాలి. దీంతో పల్లె ప్రజలకు అనారోగ్యం వస్తే ఆర్‌ఎంపీలనే ఆశ్రయిస్తున్నాయి. ఇక ఏఎన్‌ఎంలు పిల్లలకు వ్యాక్సిన్లతోనే సరిపెడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. అదే విధంగా పల్లె దవాఖానాల వైద్యులు ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు వస్తున్నారో తెలియడం లేదని చెబుతున్నారు. ఇదే అదునుగా గ్రామాల్లో ఆర్‌ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేస్తూ పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

**వైద్యశిబిరాల జాడ కరువు**

మండలంలో జ్వరబాధితుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యాన ఎక్కడికక్కడ వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తే ఫలితం ఉండేది. కానీ ఆ పరిస్థితి కానరాకపోవడంతో బాధితుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఇప్పుడు మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో ఏ ఇంటికి వెళ్లినా ఒకరు లేదా ఇద్దరు జ్వర బాధితులు కనిపిస్తున్నారు. మండలంలోని కందుకూరులో డెంగీ కేసులు ఎక్కువగా ఉన్నాయని స్థానికుల ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాక ఆయన ఆదేశాలతో వైద్యశిబిరం ఏర్పాటుచేశఋూర. మిగతా గ్రామాల్లో కూడా శిబిరాలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఇక డ్రై డే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించినా ఆ పరిస్థితి కానరాడం లేదు.

#### పకడ్బందీగా పారిశుద్ధ్య చర్యలు



వైద్యశిబిరంలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

గ్రామాల్లో డెంగీ కేసులు పెరుగుతున్న నేపథ్యాన దోమల నియంత్రణకు ఫాగింగ్‌తో పాటు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించార. మండలంలోని కందుకూరులో శనివారం పర్యటించిన జ్వర బాధితులతో మాట్లాడారు. అలాగే, పారిశుద్ధ్య పనులను పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. అంతేకాకుండా వైద్యశిబిరాన్ని కూడా పర్యవేక్షించారు. ఆతర్వాత వేంసూరు ఎస్సీ బాలుర వసతి గృహానికి వెళ్లిన ఆయన మరుగుదొడ్ల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కల్లూరు ఆర్‌డీఓ కళ్యాణ్ చక్రవర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్

**వైరారూరల్:** గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు చేయాలని ఐటీడీఏ ఏపీఓ (జనరల్), గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజు సూచించారు. వైరా మండలం ముసలిమడుగులోని తెలంగాణ గిరిజన సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల, వసతిగృహాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. వార్షిక పరీక్షల్లో వంద శాతం ఫలితాలు నమోదయ్యేలా చూడడంతో పాటుట మెడికల్, ఇంజనీరింగ్ సీట్లు సాధించేలా తర్ఫీదునివ్వాలని సూచించారు. కాగా, గురుకులంలోని పలు సమస్యలను ప్రిన్సిపాల్ నాగేంద్రమ్మ తెలపగా, మరమ్మతులకు ఆర్‌సీఓ ఆదేశాలు జారీచేశారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్.మేరీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మధు

**ఖమ్మంసహకారనగర్:** గత పదిహేనేళ్లుగా విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్తామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోతుకూరి మధు తెలిపారు. కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు చేపట్టిన రిలే దీక్షలకు శనివారం పీఆర్‌టీయూ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మధు మాట్లాడగా, సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మహబూబ్ బాషా, వీరస్వామితో పాటు రవి, భగవాన్, నాగరాజు, నాగేశ్వరరావు, మోతీలాల్, విజయ్, సైదమ్మ, రుద్రగిరి తదితరులు పాల్గొన్నారు.

### నేడు 'ఆయిల్‌ఫెడ్' భవనం ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన ఆయిల్‌ఫెడ్ విశ్రాంతి భవనం

**అశ్వారావుపేటరూరల్:** మండలంలోని నారంవారిగూడెం సమీపంలోని నర్సరీ వద్ద ఆయిల్‌ఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన విశ్రాంతి భవన నిర్మాణం పూర్తయింది. రూ.కోటి 40 లక్షలతో అతిథి గృహం, అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో రైతుల కోసం రూ. 8.90లక్షలతో ఫార్మర్ షెడ్లను నిర్మించారు. ఈ నిర్మాణాలు పూర్తికాగా ఆదివారం ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రారంభిస్తారని డీఓ ఎ.బాలకృష్ణ తెలిపారు.



## హామీలను విస్మరించిన సీఎం కేసీఆర్

**కార్యకర్తల సమ్మేళనంలో బీజేపీ నాయకులు**



మాట్లాడుతున్న గరికపాటి మోహన్‌రావు

**దమ్మపేట:** సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, ఉచిత ఎరువులు తదితర హామీలు ఇచ్చి విస్మరించారని బీజేపీ నాయకులు విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ పోలింగ్ బూత్ స్థాయి కార్యకర్తల, నియోజకవర్గ సమ్మేళనంలో మాట్లాడారు. మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దక్షతను చూసి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీని గెలిపించాలని కోరారు. నాయకులు చాడా సురేష్‌రెడ్డి, కూన శ్రీశైలంగౌడ్, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు లోపాయికారి ఒప్పందాలు చేసుకున్నాయని విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీజేపీకి తప్ప ఏ పార్టీకి ఓటు వేసినా గెలుపొందిన ఎమ్మెల్యేలు స్వప్రయోజనాల కోసం పార్టీ మారడం ఖాయమని పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు నియోజకవర్గాల్లో తప్ప అభివృద్ధి ఇంకెక్కడ లేదని విమర్శించారు. బీజేపీ నాయకులు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, భూక్యా సీతారాం నాయక్, ఈవీ.నరేష్, నంబూరి రామలింగేశ్వరరావు, భూక్యా ప్రసాద్, ఉడతనేని విశ్వేశ్వరరావు, దారా నాగేశ్వరారావు, గొట్టిపుల్ల దుర్గా శ్రీనివాస్, మడకం రమేష్, రవి, పసుమర్తి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**మధిర:** మధిరలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన ఆళ్ల కృష్ణ వైఎస్సార్ చౌరస్తా నుంచి రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదుగా స్కూటీపై ఇంటికి వెళ్తున్నాడు. ఎదురుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆయనను ఢీకొట్టి వెళ్లిపోయాడు. ఈ ఘటనలో కృష్ణ గాయాలు కాగా, ఖమ్మం తరలించారు.

## వివాహేతర సంబంధంతో హత్య

- భర్తను హత్య చేయించిన మహిళ
- ఏపీ వాసులు ముగ్గురి అరెస్ట్

**సత్తుపల్లి:** వివాహేతర సంబంధం విషయం బయటపడడంతో మందలిస్తున్న భర్తను అడ్డు తొలగించేందుకు ఓ మహిళ తన సన్నిహితుడితో హత్య చేయించింది. ఈ ఘటనలో సదరు మహిళతో పాటు నిందితుడు, వీరికి సహకరించిన మరో వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి సత్తుపల్లి సీఐ మోహన్‌బాబు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం లింగగూడెంకు చెందిన చిమట కేశవరావు– సత్యవతి భార్యాభర్తలు. ఇందులో సత్యవతికి అదే గ్రామానికి చెందిన చిమట రాముతో ఏడాదిన్నర క్రితం ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. వీరి నడుమ ఏలూరు జిల్లా చాట్రాయి మండలం మంకోలుకు చెందిన గంపా జోజిబాబు మధ్యవర్తిగా సహకరించేవాడు. కొన్నాళ్లకు ఈ విషయం బయటపడడంతో సత్యవతిని కేశవరావు మందలించాడు. ఇది జీర్ణించుకోలేని ఆమె రాముకు చెప్పి తన భర్తను హత్య చేయాలని కోరింది. ఇంతలోనే ఈనెల 1వ తేదీన రాముకు కేశవరావు ఫోన్ చేసి ఇంట్లో గొడవలు జరుగుతున్నాయని మందలించాడు. దీంతో రాము తనను క్షమించాలని కోరడంతో పాటు ఓసారి కలుద్దామని చెప్పాడు. ఈమేరకు లింగగూడెంలోని మర్రిచెట్టు వద్దకు కేశవరావు వచ్చాక తన మోటార్ సైకిల్‌పై తీసుకెళ్తూ ఆయిల్‌పామ్ తోటలో కత్తితో దాడి చేశాడు. అయితే, కేశవరావు ఇంకా ప్రాణాలతో ఉండడంతో ప్లాస్టిక్ కవర్‌ను మెడ, తల చుట్టూ కట్టి ఊపిరి ఆడకుండా చేయడంతో కన్నుమూశాడు. అనంతరం మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై సరిహద్దు సత్తుపల్లి మండలం సత్యనారాయణపురం శివార్లకు తీసుకొచ్చి ఆయిల్‌పామ్ తోటలో వేసి వెళ్లిపోయాడు. కాగా, మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టగా, ఎలాగైనా పట్టుబడతాననే భయంతో రాము గ్రామ పెద్దలకు చెప్పి సత్తుపల్లి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అనంతరం ఆయన ఇచ్చిన సమాచారంతో శనివారం లింగగూడెం వెళ్లి సత్యవతిని, మంకోలు వెళ్లి గంప జోజిబాబుని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మోహన్‌బాబు వెల్లడించారు.

## కారు, కలప స్వాధీనం



పాల్వంచలో అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న కారు, కలప

**పాల్వంచరూరల్:** రాత్రి సమయంలో కారులో అక్రమంగా తరలిస్తున్న నారవేప కలపను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఉల్వనూరు నుంచి పాల్వంచవైపు కారులో అక్రమంగా నారవేప జాతికి చెందిన కలపను తరలిస్తుండగా అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది పాండురంగాపురం వద్ద కారును ఆపి తనిఖీలు నిర్వహించారు. రూ.30 వేల విలువైన కలపను గుర్తించి కారుతో సహా స్వాధీనం చేసుకున్నారు. ఉల్వ నూరు ప్రాంతానికి చెందిన నిందితులు వజ్జ కృష్ణ, సంపత్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు రేంజర్ అనిల్‌కుమార్ తెలిపారు.

**భద్రాచలంలో..**

**భద్రాచలంటౌన్:** దుమ్ముగూడెం మండలం లచ్చిగూడెం, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన ఆరు టేకు దుంగలను అటవీశాఖ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ కలప విలువ సుమారు రూ. లక్ష ఉండగా, డిపోకు తరలించామని, భద్రాచలం రేంజ్ అధికారి రజిత తెలిపారు.

## ఆలయాల భూములు ఆక్రమిస్తే సహించేది లేదు

**నేలకొండపల్లి:** దేవాలయాల భూములను ఆక్రమిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సమత హెచ్చరించారు. మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ భూములను శనివారం పరిశీలించారు. ఇటీవల కొందరు భూములను ఆక్రమించారనే ఆరోపణల నేపథ్యాన క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఆలయ భూములను సర్వే చేయాలని రెవెన్యూ అధికారులను కోరగా, నివేదిక వచ్చిన అనంతరం హద్దులు నిర్ధారిస్తామని తెలిపారు. ఆలయ ఈఓ పి.నారాయణచార్యులు తదితరులు పాల్గొన్నారు.

### వ్యభిచారం ముఠా గుట్టురట్టు

**ఖమ్మంఅర్బన్:** ఖమ్మం యూపీహెచ్ కాలనీలోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు యువతులు, యువకులను అదుపులోకి తీసుకున్నట్లు ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరి తెలిపారు. గత ఏడు నెలలుగా ఇక్కడ ఇల్లు అద్దెకు తీసుకున్న ఆశా అనే మహిళ ఇంకొందరు యువతులను పిలిపిస్తూ వ్యభిచారం సాగిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో తనిఖీలు నిర్వహించి ఆటోడ్రైవర్లు శివ, నవీన్‌తో పాటు నిర్వాహకురాలు ఆశా, కొందరు యువతులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

### సాగర్ కాల్వలో వృద్ధుడి గల్లంతు

**ముదిగొండ:** మండలంలోని కట్టకూరు పంచాయతీ పరిధి సీతారాంపురానికి చెందిన వట్టే చిన్న నాగయ్య సాగర్ కాల్వలో పడి గల్లంతయ్యాడు. ఆయన శుక్రవారం పొలం వద్దకు వెళ్లి వస్తుండగా సాగర్ కాల్వలో స్నానం చేసేందుకు దిగాడు. అయితే, ప్రమాదవశాత్తు కాలు జారి గల్లంతై ఉంటాడని భావిస్తున్నారు. కాల్వ ఒడ్డున దుస్తులు ఉండడం, నాగయ్య కాల్వలో దిగుతుండగా చూసిన రైతులు ఇచ్చిన సమాచారంతో శనివారం ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి వరకు గాలించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో ముదిగొండ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.

### పెళ్లి వేడుకలో ఘర్షణ

**ఐదుగురికి తీవ్రగాయాలు**

**కామేపల్లి(కారేపల్లి):** పెళ్లి వేడుక సందర్భంగా మద్యం మత్తులో ఉన్న కొందరి తీరుతో ఘర్షణ జరగగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కామేపల్లి మండలం లింగాల శ్రీకోటమైసమ్మ ఆలయ సమీపాన ఫంక్షన్ హాల్‌లో ముస్లింలకు చెందిన వివాహం శనివారం జరుగుతోంది. విందు ఏర్పాట్లలో భాగంగా మహిళలు, పురుషులకు వేర్వేరుగా ఏర్పాట్లు చేయగా, వరుడి వైపు యువకుడు ఒకరు మద్యం మత్తులో మహిళలు ఉన్న చోటకు వెళ్లాడు. దీంతో ఆయనను బయటకు పంపిస్తుండగా ఘర్షణకు దిగడంతో మందలించారు. ఈమేరకు ఆయన ఆయన మరికొందరు బంధువులను తీసుకొచ్చి గొడవ పడడంతో ఇరువర్గాలకు చెందిన ఐదుగురి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కామేపల్లి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

### కుటుంబ కలహాలతో ఆత్మహత్య

**ఖమ్మం క్రైం:** భార్యతో గొడవ పడి పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఖమ్మం త్రీ టౌన్ సీఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. భద్రాద్రి జిల్లా మణుగూరుకు చెందిన పులి దుర్గాప్రసాద్(30) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తుండగా, ఆయనకు భార్య నాగమణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఆయన భార్య గర్భవతి కాగా, మద్యానికి బానిసైన ఆయన తరచూ వేధిస్తున్నాడు. దీంతో ఆమె పిల్లలను తీసుకుని ఖమ్మం రంగనాయకుల గుట్ట వద్ద నివసించే దుర్గాప్రసాద్ అక్క ఇంటికి వచ్చింది. ఈమేరకు ఆయన కూడా ఇటీవల వచ్చి మరోమారు భార్యతో గొడవ పడడంతో ఆమె బయటకు వెళ్లింది. దీంతో మద్యంలో ఎలుకల మందు కలుపుకుని తాగిన ఆయనను ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందడంతో బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



## రూ. 6 లక్షల కోట్లు

- ఏలేరు నుంచి స్కిల్ స్కాం వరకు ప్రజాధనం దోపిడీ
- రాజకీయ అరంగేట్రం నుంచే 'మేత'కు మరిగిన నేత
- ఎన్టీఆర్‌కు వెన్నుపోటుతో దొడ్డిదారిన అధికారంలోకి
- ఏలేరు స్కాంతో దేశంలో సంచలనం సృష్టించిన బాబు
- 1995-2004 మధ్య ప్రజాధనం దోపిడీలో విశ్వరూపం
- కుంభకోణాల బాబును 2004లో ఇంటికి పంపిన జనం
- విభజన నేపథ్యంలో హామీలు ఎర వేసి మోసం
- అధికారంలోకి వచ్చాక నిజ స్వరూపాన్ని చాటిన వైనం
- 'స్కాం'ల కోసమే స్కీంలు ప్రవేశ పెట్టిన ఘనత

## దోపిడీకి రాచబాట

- అధికారులను బెదిరించి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు
- చంద్రబాబుతో పాటు నారాయణ, లోకేశ్‌లదీ కీలక 'భూ'మిక
- లింగమనేనితో క్విడ్ ప్రో కో
- రోడ్డు అలైన్‌మెంట్‌లో అవినీతి మెలికలు
- ప్రతిగా కరకట్ట నివాసం, లింగమనేని నుంచి భూములు
- రూ. 2 వేల కోట్ల భూ దోపిడీకి బాబు స్కెచ్

# సూత్రధారి, లబ్ధిదారుడు అంతా అతడే

- బలమైన సాక్ష్యాధారాలతోనే చంద్రబాబును సీఐడీ అరెస్టు చేసింది: సజ్జల
- ఇందులో రాజకీయ దురుద్దేశాలు, కక్ష సాధింపులు లేవు
- దేశ చరిత్రలో అత్యంత దారుణమైన ఆర్థిక నేరం స్కిల్ స్కామ్
- 2017–18లోనే ఈ కుంభకోణాన్ని బహిర్గతం చేసిన జీఎస్టీ ఇంటెలిజెన్స్ విభాగం
- చంద్రబాబు ఆదేశాలతోనే నిధులిచ్చామని ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌లు కోర్టులో చెప్పారు
- స్కిల్ డెవలప్‌మెంట్, డిజైన్ టెక్, గత ప్రభుత్వంతో తమకు సంబంధం లేదన్న సీమెన్స్
- నిన్నటి వరకూ బాబు గొంతెత్తి అరుస్తూ తిరుగుతున్నారు కదా?
- అరెస్టు చేయగానే హఠాత్తుగా బీపీనా?.. చౌకబారు రాజకీయాలొద్దు

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ ముసుగులో ప్రభుత్వ ఖజానా నుంచి డిజైన్ టెక్, ఇతర షెల్ కంపెనీల ద్వారా రూ.371 కోట్ల దోపిడీలో ప్రధాన సూత్రధారి, పాత్రధారి, లబ్ధిదారుడు మాజీ సీఎం చంద్రబాబేనని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. చంద్రబాబు ఆర్థిక నేరానికి పాల్పడ్డారని బలమైన సాక్ష్యాధారాలు ఉన్నందు వల్లే సీఐడీ సిట్ విభాగం శనివారం ఉదయం 6 గంటలకు ఆయన్ను అరెస్టు చేసిందని తెలిపారు. నేరానికి సంబంధించి ఒక వ్యక్తి పాత్రపై కచ్చితమైన ఆధారాలు ఉన్నప్పుడు దర్యాప్తు సంస్థలు విచారణలో భాగంగా వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించడం సాధారణమేనన్నారు. ఈ కేసులో అసలు విషయాన్ని మరుగున పరుస్తూ రాజకీయంగా కక్ష సాధింపులో భాగంగానే అరెస్టు చేశారంటూ చంద్రబాబుతోపాటు టీడీపీ నేతలు, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పూర్తి నిగ్రహం, సంయమనం పాటిస్తూ ఎలాంటి దురుద్దేశాలు లేకుండా బలమైన సాక్ష్యాధారాలు లభించిన తరువాతే చంద్రబాబును సిట్ అరెస్టు చేసిందని స్పష్టం చేశారు. శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సజ్జల మీడియాతో మాట్లాడారు.



**దేశ చరిత్రలో తీవ్ర ఆర్థిక నేరమిదే..**

2017–18లో స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో డిజైన్ టెక్‌కు చేసిన చెల్లింపులపై జీఎస్టీ ఇంటెలిజెన్స్ విభాగం దర్యాప్తు చేసింది. ఇందులో రూ.240 కోట్లు షెల్ కంపెనీల ద్వారా దారి మళ్లినట్లు తేల్చింది. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భారీ ఎత్తున అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని 2018లో విజిల్ బ్లోయర్ ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై ఏసీబీ విచారణను అప్పటి సీఎం చంద్రబాబు తొక్కి పట్టి నోట్ ఫైల్స్‌ను మాయం చేశారు. ఆధారాలను ధ్వంసం చేయడం ద్వారా తన అక్రమాలను అప్పట్లోనే ఆయన అంగీకరించారు. ఏసీబీ దర్యాప్తును చంద్రబాబు తొక్కిపెడితే.. 2021 డిసెంబర్ 9న సీఐడీ సిట్ విభాగం విచారణ ప్రారంభించింది. ఈ కుంభకోణంపై దర్యాప్తు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నలుగురిని అరెస్టు చేసి డిజైన్ టెక్‌కు చెందిన రూ.31 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. తాము వద్దని వారించినా డిజైన్ టెక్‌కు నిధులు విడుదల చేయాలని అప్పటి సీఎం చంద్రబాబు ఆదేశించడం వల్లే నిధులు విడుదల చేశామని సెక్షన్ 164 కింద న్యాయస్థానంలో సీనియర్ ఐఏఎస్ అధికారులు సాక్ష్యమిచ్చారు. తమ పేరుతో డిజైన్ టెక్, నాటి రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందంతో తమకు సంబంధమే లేదని.. 90 శాతం గ్రాంట్–ఇన్–ఎయిడ్‌గా ఇస్తామని తాము ఎక్కడా చెప్పలేదని సెక్షన్–164 కింద న్యాయస్థానంలో సీమెన్స్ ప్రతినిధులు సాక్ష్యమిచ్చారు. ప్రభుత్వ ఖజానా నుంచి రూ.371 కోట్లను డిజైన్ టెక్‌కు దోచిపెట్టి షెల్ కంపెనీల ద్వారా వాటిని చంద్రబాబు తిరిగి తన ఇంటికి తెచ్చుకున్నారు. దేశ చరిత్రలో అత్యంత దారుణమైన ఆర్థిక నేరమిది. ఈ కుంభకోణంపై దర్యాప్తు చేసిన సీఐడీ విభాగం కోర్టులో అఫిడవిట్లు దాఖలు చేసింది. చంద్రబాబు అక్రమాలకు పాల్పడ్డారనడానికి బలమైన సాక్ష్యాధారాలు లభించడంతోనే ఆయన్ను అరెస్టు చేసింది. ఇందులో ఎలాంటి కక్ష సాధింపులు లేవు.

**చట్టం ముందు అందరూ సమానులే..**

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తనను అరెస్ట్ చేస్తారని చంద్రబాబుకు ముందే తెలుసు. తనపై నేరారోపణ బలంగా ఉందని తెలుసు. అందుకే వారం క్రితమే తనని అరెస్ట్ చేస్తారని ప్రకటించారు. ఒకవేళ అరెస్ట్ జరగకపోతే తాను నిజాయితీపరుడిని కాబట్టే అరెస్టు చేయలేదని చెప్పుకునే ప్రయత్నం చేశారు. చంద్రబాబును అర్ధరాత్రి అరెస్టు చేశారంటూ ఆరోపణలు చేయడం విడ్డూరం. బాగా తెల్లవారిన తర్వాతే ఆయన్ను అరెస్టు చేశారు. తమిళనాడులో కరుణానిధిని అరెస్టు చేసినట్లుగా అర్ధరాత్రి వెళ్లి లేపి అరెస్టు చేయలేదు. చట్టం ముందు యువకుడైనా, వృద్ధుడైనా ఒకటే. ఆర్థిక నేరానికి పాల్పడ్డ కేసులో నిందితుడిని అరెస్టు చేయడానికి ముందు నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎఫ్‌ఐఆర్‌లోనే అన్నీ ఉంటే ఇక విచారణ ఎందుకు? సీఐడీ దర్యాప్తులో తీగ లాగితే డొంకంతా కదిలి చంద్రబాబు వద్దకు చేరింది. అందుకే ప్రధాన నిందితుడిగా చేర్చి అరెస్టు చేశారు. కక్ష సాధింపులు చంద్రబాబుకే అలవాటు. వాటిని సీఎం జగన్‌కు ఆపాదిస్తే ఎలా? తన తండ్రి చంద్రబాబును పరామర్శించేందుకు లోకేష్ వెళ్తే ఎందుకు రానివ్వరు? అక్కడకు వెళ్లి రచ్చ చేయాలని చూస్తేనే సమస్య.

### హఠాత్తుగా అనారోగ్యమా?

చంద్రబాబును న్యాయస్థానంలో సీఐడీ అధికారులు ప్రవేశపెడతారు. అవసరమైతే కస్టడీకి అడుగుతారు. అరెస్టు చేయగానే తనకు బీపీ ఉందని చంద్రబాబు అంటున్నారు. అనారోగ్యం సడన్‌గా వస్తుందా? నిన్నటి వరకూ గొంతెత్తి అరుస్తూ తిరుగుతున్నారే? ఉదయం లేవగానే హైపర్ టెన్షన్ ఎలా వస్తుంది? చౌకబారు రాజకీయ ఎత్తుగడలతో ఉపయోగం ఉండదు. టీడీపీ తన ఉనికిని ఎప్పుడో కోల్పోయింది. చంద్రబాబు సహా ఆ పార్టీ నేతలు ప్రజల సమస్యలను మర్చిపోయారు. వారు ప్రభుత్వంలో ఉన్నప్పుడు కూడా ప్రజల గురించి ఆలోచించలేదు. ఇప్పుడు కూడా అంతే. ప్రజలను భ్రమల్లో పెట్టి అధికారంలోకి రావాలనుకున్నారు. గతంలో అలానే అధికారంలోకి వచ్చారు. సీఎం జగన్‌ను, వైఎస్సార్‌సీపీని దూషిస్తూ టీడీపీ బూతుల పార్టీగా మారింది. ఆ పార్టీకి ఓ స్పష్టమైన అజెండా అంటూ లేదు. సీఎం జగన్ చేస్తున్న మంచి పనులతో ప్రజల్లో మంచి స్పందన వస్తోంది. ఇది ప్రతి ఎన్నికల్లోనూ నిరూపితమవుతూనే ఉంది. వచ్చే ఎన్నికల్లోనూ అదే జరుగుతుంది.

# తప్పుచేయని వారిని ప్రభుత్వం అరెస్టుచేస్తోంది

### మీడియాకు వీడియో సందేశంలో పవన్‌కళ్యాణ్

- చంద్రబాబుకు జనసేన సంపూర్ణ మద్దతు
- రోడ్డు మార్గంలో విజయవాడ వచ్చేందుకు యత్నం
- జగ్గయ్యపేట వద్ద పోలీసుల అడ్డగింత
- రోడ్డుపైనే పడుకున్న జనసేన అధినేత..
- చివరికి పోలీసుల అదుపులో పవన్, నాదెండ్ల.. వాహనంలో అక్కడ నుంచి తరలింపు



రోడ్డుపై పడుకున్న పవన్‌కల్యాణ్

సాక్షి, అమరావతి/గన్నవరం/గరికపాడు (జగ్గయ్యపేట): తప్పుచేయని నేతలను ఈ ప్రభుత్వం అరెస్టు చేస్తోందంటూ జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అరెస్టుపై ఆయన స్పందిస్తూ.. చంద్రబాబుకు జనసేన సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాకు ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. 'ప్రాథమిక ఆధారాలు చూపించకుండా అర్ధరాత్రి అరెస్టు విధానాన్ని రాష్ట్రంలో అవలంబిస్తున్నారు. గతేడాది అక్టోబరులో విశాఖపట్నంలో కూడ జనసేనపట్ల పోలీసు వ్యవస్థ, ఈ ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరించిందో అందరూ చూశారు. ఏ తప్పు చేయని మా పార్టీ నాయకులపై హత్యాయత్నం కేసులు పెట్టి అరెస్టుచేశారు. ఇప్పుడు చంద్రబాబు విషయంలో నంద్యాలలో జరిగిన సంఘటన కూడా అలాంటిదే. ఆయన అరెస్టును జనసేన ఖండిస్తోంది. ఒక నాయకుడు అరెస్టయితే, ఆయనకు మద్దతుగా పార్టీ అనుచరులు, వాళ్ల పార్టీ క్యాడర్ కచ్చితంగా బయటకొస్తారు. అది ప్రజాస్వామ్యంలో భాగం. వాళ్లు ఇళ్లలోంచి బయటకు రాకూడదనుకుంటే ఎలా? దీనిని కచ్చితంగా రాజకీయ కక్షసాధింపు చర్యగా చూస్తున్నాం' అంటూ పవన్ వ్యాఖ్యానించారు.

**పవన్ ప్రత్యేక విమానం ల్యాండింగ్‌కు అనుమతి నిరాకరణ..**

ఇక పవన్‌కళ్యాణ్ ప్రత్యేక విమానం ల్యాండింగ్‌కు గన్నవరం ఎయిర్‌పోర్ట్ అధికారులు అనుమతి నిరాకరించారు. తొలుత కృష్ణాజిల్లా ఎస్పీ పి.జాషువా ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్‌కు శాంతిభద్రతల సమస్యను వివరిస్తూ విమానం ల్యాండింగ్‌కు అనుమతులు ఇవ్వవద్దని లేఖలో కోరారు. దీంతో ఎయిర్‌పోర్ట్ అధికారులు అనుమతివ్వలేదు. మరోవైపు.. చంద్రబాబు అరెస్టుకు సంఘీభావం తెలపడానికి పవన్ కళ్యాణ్ విజయవాడ రావడానికి ప్రయత్నిస్తే హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లోనే పోలీసులు అడ్డుకున్నారని గన్నవరంలో జనసేన నేత నాదెండ్ల ఆరోపించారు.

### రోడ్డుపై పడుకుని పవన్ నిరసన

అరెస్టయిన చంద్రబాబుకు సంఘీభావం తెలిపేందుకు పవన్ శనివారం రాత్రి విజయవాడ చేరుకునేందుకు రోడ్డు మార్గాన బయల్దేరారు. దీంతో ఆ పార్టీ నేతలు నాదెండ్ల మనోహర్ సహా కొందరు కార్యకర్తలు జగ్గయ్యపేట మండలం గరికపాడు వద్దకు చేరుకున్నారు. అయితే, పవన్‌ను గరికపాడు చెక్‌పోస్టు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అక్కడ నుంచి విజయవాడకు బయల్దేరినప్పటికీ, ఆ తర్వాత మరోసారి అనుమంచిపల్లి వద్ద పోలీసులు నిలువరించారు. ఆంక్షల నేపథ్యంలో అనుమతిలేదని పోలీసులు ఎంత నచ్చచెప్పినప్పటికీ పవన్ వినకపోవటంతోపాటు ఆయన మొండిగా రోడ్డుపై పడుకున్నారు. దాదాపు రెండు గంటలపాటు ఇలా హైడ్రామా నడిచింది. చివరికి ఆయనతోపాటు నాదెండ్ల మనోహర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనంలో తరలించారు. వీరిని ఎక్కడికి తరలిస్తున్నదీ పోలీసులు వెల్లడించలేదు. మరోవైపు.. పవన్, ఆ పార్టీ శ్రేణుల తీరుతో జాతీయ రహదారికి ఇరువైపుల ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాగా, పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్‌ను చిల్లకల్లు మీదుగా విజయవాడకు పోలీసులు తరలించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

### 'ఫైబర్‌గ్రిడ్'లోనూ అదే స్కిల్

- టెరాసాఫ్ట్ పేరుతో రూ.284 కోట్లు కొట్టేసిన లోకేశ్ సన్నిహితులు
- నెట్సాఫ్ పేరుతో డొల్ల కంపెనీ సృష్టించి కొట్టేసిన వేమూరి హరికృష్ణ
- ఫైబర్‌గ్రిడ్ కుంభకోణంపై సీఐడీ దర్యాప్తు
- ఇప్పటికే ఈ కేసులో నలుగురు సూత్రధారుల అరెస్టు
- త్వరలో కీలక సూత్రధారుని అరెస్టుకూ రంగం సిద్ధం

### కదిలిన అవినీతి పునాది!

- తాత్కాలిక భవనాలు, పేదల టిడ్కో ఇళ్ల నిర్మాణాల్లో చంద్రబాబు లూటీ
- ఈ కుంభకోణాలను సాక్ష్యాధారాలతో వెల్లడించిన ఆదాయపన్ను శాఖ
- షాపూర్జీ పల్లోంజీ, ఎల్‌అండ్‌టీ నుంచి రూ.118.98 కోట్లు కొట్టేసిన బాబు
- డొల్ల కంపెనీల ద్వారా ముడుపుల తరలింపు
- పార్టీ ఫండ్ రూపంలో కాకుండా నేరుగా నగదు కావాలని డిమాండ్

### టిడ్కో ఇళ్లకూ రూ.8,929 కోట్ల 'టెండర్'

- ఐదు లక్షల మంది పేదలను దోచుకునేందుకు స్కెచ్
- 2,08,160 టిడ్కో యూనిట్ల కాంట్రాక్టును ఎనిమిది సంస్థలకు కట్టబెట్టిన వైనం
- చ.అ. నిర్మాణ వ్యయం రూ.వెయ్యిలోపే ఉంటే.. రూ.2,203 చెల్లింపు
- అధికంగా ముడుపులు ఇచ్చిన సంస్థకు ఎక్కువగా చెల్లించిన బాబు
- నిర్మాణ సంస్థను బట్టి రూ.2,534.75 నుంచి రూ.2,034.59 చెల్లింపు

జిల్లా వార్తలు

### శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదును అందజేస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి భక్తులు శనివారం రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన చెరుకూరి శేఖర్ – మాధవి దంపతులు ఆలయ అధికారులకు విరాళం అందచేయగా వారు స్వామి దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ సాయిబాబ తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు అందించాలి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్యసేవలు అందించాలని సింగరేణి డైరెక్టర్ ఎన్.బలరామ్ సూచించారు. ఆస్పత్రి వైద్యులతో శనివారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే వారితో మర్యాదగా ప్రవర్తిస్తూ మెరుగైన వైద్యసేవలు అందించాలని స్పష్టం చేశారు. ఆస్పత్రి ఆధునికీకరణపై సీఎండీ సుముఖంగా ఉన్న నేపథ్యాన స్పెషలిస్ట్ వైద్యులను నియమించడంతోపాటు నూతన పరికరాలను సమకూర్చామని తెలిపారు. ఇటీవల కీళ్లమార్పిడి ఆపరేషన్లు కూడా ప్రారంభించడంతో ఆస్పత్రికి నమ్మకం పెరుగుతోందని చెప్పారు. ఈ సమావేశంలో సీఎంఓ సుజాత, డీవైసీఎంఓ విక్టర్ వందనం, ఏసీఎంఓ సునీలతోపాటు పీఏ మండల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఎంబీఏలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం సహకార్ నగర్: ఖమ్మంలోని కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎంబీఏలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ చేకూరి రవికుమార్ సూచించారు. ఐసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు వెబ్ ఆప్షన్‌లో తమ కళాశాల కేయూ కేహెచ్ ఎస్ఎఫ్‌ను మొదటి ప్రాధాన్యతగా ఎంచుకుని సీటు పొందాలని తెలిపారు. ఈనెల 11వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు గడువు ఉన్నందున వివరాల కోసం కళాశాలలో కానీ 99122 63863, 94406 52571 నంబర్లలో కానీ సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

# మరింత విస్తృతంగా 'ఆరోగ్య మహిళ'

- ఉమ్మడి జిల్లాలో మరో 15 కేంద్రాలకు అనుమతి
- ఈనెల 12నుంచి మహిళలకు వైద్యపరీక్షలు



మహిళా ఆరోగ్య కేంద్రంగా ఎంపికైన నేలకొండపల్లి పీహెచ్‌సీ

నేలకొండపల్లి: మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న రాష్ట్రప్రభుత్వం పలు పీహెచ్‌సీల్లో మహిళలకు వైద్యపరీక్షలకు ఏర్పాటుచేసింది. ఆయా కేంద్రాల్లో ప్రతీ మంగళవారం పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తుండగా, ఆధునిక వైద్యం అవసరమైన వారికి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలోని ఆరు కేంద్రాల్లో ఆరోగ్య మహిళ అమలవుతుండగా, కొత్తగా ఆరు పీహెచ్‌సీలకు అనుమతి ఇచ్చారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ తొమ్మిది కేంద్రాలకు అనుమతి జారీ చేశారు. ఆయా కేంద్రాల్లో ప్రతీ మంగళవారం ఉదయం 9నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మహిళలకు సంబంధించిన ఎనిమిది రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం వైద్యాధికారులకు శిక్షణ కూడా ఇచ్చారు. ఇక్కడకు వచ్చే మహిళల నుంచి రక్త నమూనాలు సేకరించి జనరల్ ఆస్పత్రుల్లోని టీ హబ్‌కు పంపిస్తారు. అనంతరం నివేదికలను మహిళల ఫోన్లపాటు సంబంధిత మహిళా ఆరోగ్య కేంద్రాల వైద్యులకు పంపిస్తారు. ఈ నివేదికల ఆధారంగా వైద్యులు స్థానికంగా చికిత్స అందించి, తీవ్రత ఉంటే జనరల్ ఆస్పత్రికి రిఫర్ చేస్తారు. అక్కడ కేన్సర్ లక్షణాలు బయటపడితే మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు రిఫర్ చేయనున్నారు.

**ఉమ్మడి జిల్లాలో ఎంపికైన కేంద్రాలు ఇవే...**

ఖమ్మం జిల్లాలో కొత్తగా పెనుబల్లి మండలం లంకాసాగర్, ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు, వేంసూరు, ఖమ్మంలోని పాత మున్సిపాలిటీ ఆరోగ్య కేంద్రాలకు ఆరోగ్య మహిళ పరీక్షలకు అనుమతి ఇచ్చారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం, జూలూరుపాడు, పినపాక, ఇల్లెందు మండలం రొంపేడు, కరకవాగు, పినపాక మండలం జానంపేట, పాల్వంచ మండలం ఉల్వనూరుతోపాటు ఇల్లెందు, పాల్వంచల్లోని బస్తీ దవాఖానాలకు అనుమతి మంజూరు చేశారు. ఆయా కేంద్రాల్లో వచ్చే మంగళవారం నుంచి మహిళలకు ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించనున్నారు.

**ప్రత్యేక చికిత్స, వైద్యం**



మహిళలకు మరింత మెరుగైన వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా పలు సెంటర్లకు ఆరోగ్య మహిళ ద్వారా పరీక్షలు చేసేందుకు అనుమతులు జారీ చేసింది. ఇక్కడ మహిళా వైద్యులు, సిబ్బంది వైద్యపరీక్షలు, చికిత్స బాధ్యతలు నిర్వర్తిస్తారు.

– శ్రావణ్‌కుమార్, వైద్యాధికారి, నేలకొండపల్లి

# మార్పు ఇక్కడి నుంచే మొదలుకావాలి..

- ఈసారి బీజేపీకి అవకాశం ఇవ్వండి
- మాటల్లోనే తప్ప చేతల్లో కానరాని 'బంగారు తెలంగాణ'
- బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్



సభలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్, పక్కన సుధాకర్‌రెడ్డి తదితరులు

వైరా: అన్ని పార్టీలకు ఇప్పటివరకు అవకాశం ఇచ్చిన ఖమ్మం జిల్లా ప్రజలు వచ్చే ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలని బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కోరారు. వైరాలో శనివారం జరిగిన నియోజకవర్గ స్థాయి బూత్ స్థాయి సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో బీజేపీ లేదని అంటున్న వారికి సమాధానం చెప్పేలా... మార్పునకు ఇక్కడి నుంచే నాంది పలకాలని పిలుపునిచ్చారు. వైరా ఎమ్మెల్యే రాములునాయక్ పదవి పోకముందే తన పనులకు ఆటంకం కలిగిస్తున్నారని చెప్పడం బీఆర్‌ఎస్‌లో పరిస్థితిని తెలియచేస్తోందని చెప్పారు. సాగు చేసుకుంటుటున్న భూముల జోలికి రావొద్దని కోరిన ఖమ్మం జిల్లా గిరిజనులు, మహిళలు, గర్భవతులను జైలుకు పంపిన ఘనత ఈ పాలకులదని ఆరోపించారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతే రైతులను ఆదుకునేందుకు కేంద్రప్రభుత్వం ఫసల్ బీమా పథకాన్ని తీసుకొస్తే రాష్ట్రం వాటా చెల్లించకుండా నీరుగార్చిందని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే సన్న, చిన్నకారు రైతులతోపాటు కౌలు రైతులకు సైతం ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. అలాగే, బస్తాకు 600 గ్రాముల కంటే ఎక్కువ తరుగు తీయకుండా ధాన్యం కొంటామని, ఒకే ఇంట్లో భార్యాభర్తలు వృద్ధులైతే ఇద్దరికీ పింఛన్ ఇస్తామని చెప్పారు. కాగా, రైతు రుణమాఫీ చేస్తానన్న హామీని ఇన్నాళ్లు విస్మరించి, ఇప్పుడు ఎన్నికలు వస్తుండడంతో భూములు అమ్మి, వైన్స్ టెండర్లు నిర్వహించి రుణమాఫీ చేస్తున్నారని ఎద్దేవాచేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీలు గరికపాటి మోహనరావు, చాడ సురేష్‌రెడ్డి, రవీంద్రనాయక్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డితో పాటు కూసంపూడి వీరేందర్, శ్యాంసుందర్‌నాయక్, బీ.పీ.నాయక్, కృష్ణ రాథోడ్, అశ్వత్థామరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నంబూరి రామలింగేశ్వరరావు, శీలం పాపారావు, కొవ్వూరి నాగేశ్వరరావు, నెల్లూరి కోటేశ్వరరావు, కృష్ణరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్‌సీని నియమించి.. ఐఆర్ ప్రకటించాలి



మాట్లాడుతున్న దుర్గాభవాని

ఖమ్మంసహకారనగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో చేసిన ప్రకటన మేరకు ఉద్యోగుల వేతన సవరణ కోసం కమిషన్‌ను నియమించడమే కాక, నివేదిక వచ్చే వరకు ఇంటీరియం రిలీఫ్(ఐఆర్) ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గాభవాని డిమాండ్ చేశారు. ఖమ్మంలోని యూటీఎఫ్ భవన్‌లో శనివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీలో ప్రకటన చేసి రోజులు గడుస్తున్నా ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయలేదని, వేతన సవరణ సంఘాన్ని నియమించలేదని ఆరోపించారు. ఇకనైనా పీఆర్‌సీని నియమించడమే కాక ఉద్యోగులకు బకాయి ఉన్న మూడు విడతల డీఏ విడుదల చేయాలని, ఈ–కుబేర్‌లో పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ట్రైబల్ వెల్ఫేర్ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్ల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని, కేజీబీవీ, యూఆర్‌ఎస్ సిబ్బందికి కనీస వేతనం అమలుచేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు బుర్రా వెంకన్న, పల్లంకొండ రాంబాబు, షేక్ రంజాన్, ఎ.సుధాకర్, మండవ నర్సయ్య, బానోతు రాందాస్, కె.గీత, రమేష్, పి.సురేష్, నిర్మలాకుమారి, నాగేశ్వరరావు, నాగూర్ వలీ పాల్గొన్నారు.

# జీ–20 సదస్సుపై సెమినార్



పోటీల్లో విజేతలతో ట్రైయినీ ఐపీఎస్ అవినాశ్

ఖమ్మం స్పోర్ట్స్: ఢిల్లీలో జరుగుతున్న జీ– 20 సదస్సును పురస్కరించుకుని ఖమ్మంలోని కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఎన్‌సీసీ తెలంగాణ 11వ బెటాలియన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ సెమినార్‌లో ట్రైయినీ ఐపీఎస్ అవినాశ్‌కుమార్ మాట్లాడుతూ జీ–20 సదస్సు నిర్వహణతో భారత్ ఖ్యాతి ప్రపంచవ్యాప్తంగా మార్మోగుతోందని తెలిపారు. బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ నవీన్ యాదవ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ కేడెట్లకు దేశాభివృద్ధి, ప్రపంచ దేశాల సరసన మన పాత్రపై అవగాహన కల్పించేందుకు ఈ సెమినార్ నిర్వహించామని తెలిపారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ కోటా అప్పిరెడ్డి మాట్లాడుతూ కేడెట్లకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వీ.రమణ తదితరులు పాల్గొన్నారు.

# పూడ్చిపెట్టిన మృతదేహానికి పోస్ట్‌మార్టం

**అనుమానాస్పద మృతిగా ఫిర్యాదుతో కేసు నమోదు**

కామేపల్లి(కారేపల్లి): ఇటీవల పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి చెందగా... ఫుడ్‌పాయిజన్‌గా భావించి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఖననం చేశారు. అయితే, వివాహేతర సంబంధం నేపథ్యాన ఈ ఘటన జరిగినట్లుగా కుటుంబీకులు ఆలస్యంగా ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగి మృతదేహాన్ని వెలికితీసి పోస్ట్‌మార్టం చేయించారు. కామేపల్లి మండల కేంద్రంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకోగా, వివరాలిలా ఉన్నాయి. కామేపల్లికి చెందిన మోసం రాఘువ(29) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూనే సొంత కారును అద్దెకు తిప్పుతుంటాడు. గతనెల ఆగస్టు 31న అదే గ్రామానికి చెందిన మహిళను ఆమె బంధువుల ఇంటి వద్ద దిగబెట్టేందుకు కారులో వరంగల్‌లో వెళ్లి తిరిగి వచ్చే క్రమాన తొర్రూరులోని ఓ దాబాలో పురుగుల మందు తాగాడు. కారులోనే పడిపోయిన ఆయనను స్థానికులు గుర్తించి పోలీసులకు చెప్పగా వారు కుటుంబీకులకు తెలిపారు. దీంతో రాఘవను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి తీసుకొచ్చి చికిత్స చేయిస్తుండగా, ఈనెల 2న మృతి చెందాడు. అయితే, ఫుడ్ పాయిజన్ అయి ఉండొచ్చని వైద్యులు చెప్పడంతో సాధారణ మరణంగానే భావించిన కుటుంబీకులు రాఘవ మృతదేహానికి అదేరోజు అంత్యక్రియలు నిర్వహించారు. ఆతర్వాత ఆయన ఫోన్‌ను పరిశీలించగా ఓ మహిళతో పలుమార్లు మాట్లాడినట్లు గుర్తించగా, ఆమెతో వివాహేతర సంబంధం ఉనట్లు యటపడింది. దీంతో రాఘవ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆయన సోదరుడు ఈనెల7న కామేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సదరు మహిళ కారణంగానే తన సోదరుడు మృతి చెందాడని, మానసికంగా, శారీరకంగా వేధించారని పేర్కొన్నాడు. అలాగే, ఘటన తొర్రూరు పరిధిలో జరిగినందున అక్కడ కూడా ఫిర్యాదు చేయగా అమరబోయిన రజిత అనే మహిళపై కేసు నమోదైంది. దీంతో శనివారం తొర్రూర్ ఎస్ఐ వేణు, కామేపల్లి తహసీల్దార్ లక్ష్మి సమక్షాన పూడ్చిపెట్టిన రాఘవ మృతదేహాన్ని బయటకు తీయించగా వైద్యులు అక్కడే పోస్టుమార్టం పూర్తిచేశారు.